


# మరపు రాని రోజు

గంద్రేటి పెంటయ్య

మంగళవాయిద్యాల సంగీతం తారస్థాయి నందుకున్నది. పెళ్ళికొడుకు చేతుల్లో వ్రేలాడుతుండే మంగళసూత్రం దీవ మెడలో దివ్యతేజస్సుతో మెరిసింది. వరుని కనులు జ్యోతుల్లా వెలిగాయి. అదేక్షణం వధువు కనురెప్పలు సిగ్గుతో బరువై క్రిందికి వ్రాలిపోయాయి.

ఒక్కసారి నా మనస్సుకు రాజేష్ మనోభావాలను చదవాలనిపించింది. పెళ్లి పందిరిలో ఎదురుగా నిలుచున్న అతడి

ముఖంలోకి పరిశీలనగా చూశాను. ఏ భావమూ స్ఫురించలేదు. నిశ్చలమైన సెలయేటిలా వున్నాడు.

నిజానికి మంచివాళ్ళ భావాలెప్పుడూ అదర్శయుక్తంగానే వుంటాయి. రాజేష్ లాంటి యువకుల్లో యీర్ష్య, ద్వేషం లాంటి చెడుగుణాలకు తావుండదు. కాని అసంకల్పితంగా జరిగిన యే చిన్న పొరపాటువలనో తామాశించిన దారి తారుమారౌతుంది. మరుపురాని ఓ సంఘటన మళ్ళీ మదిలో మెదిలింది.

* * *

రవివర్మగారూ, నేను చాల రోజుల నుండి ఒరిస్సాలో వుంటున్నాం. ఆయన డాక్టరు. ప్రైవేటు ప్రాక్టీసు పెట్టుకున్నారు. దీప అతనికి ఒక్కగానొక్క కూతురు. శ్రీదేవి అలనలో అతని జీవితం సాఫీగా సాగిపోతుందనే నా నమ్మకం.

రవివర్మ కులానికి బ్రాహ్మణుడే అయినా, అన్ని కులాల వ్యక్తులతోను సరదాగా సంతోషంగా సాంగత్యంతో గడపడమే అతని తత్వం. తన కుటుంబంలోని వ్యక్తులు ముచ్చటగా ముగ్గురే. తను, శ్రీదేవి, కూతురు దీప. మూడు మంచి మనసుల సమ్మేళనమే రవివర్మ గారి ఆనంద నివాసం.

అతడు ప్రవాసాంధ్రులంటే పడిచచ్చే స్వభావి. ఎవరి నోటనన్నా తెలుగుపదం వినబడ్డదంటే చెవులప్పగించి, ఆత్మృతగా ఆరా తీసి, మంచి చెడులు సేకరించి, సాదరంగా యింటి కాహ్వానించి, స్నేహానికి నాంది పలుకుతారు. పెద్ద చిన్నలన్న తేడా గాని, బీదసాదలనే భేద భావం గాని అవంతయినా లేని నిగర్వి.

నిజానికి నేనేమీ కాను. నెలకు మూడు వందలు తెచ్చుకుంటున్న ఒక సాధారణ మయిన ప్రభుత్వోద్యోగిని. కాని ఆయన నన్నో ప్రాణస్నేహితునిగా, స్వంత తమ్ముడిలా చూసుకుంటారు.

ఆ రోజు—

ఆనంద నివాసంలో మా యిద్దరిమధ్య చదరంగం చకచకా సాగుతున్నది. పావులన్నీ మెలకువగానే అడుగులేస్తున్నాయి. ఇంతలో కాలింగ్ బెల్ మ్రోగింది. ఇద్దరం లేద్దామనుకుంటూనే, అప్పుడే వచ్చిన దీపకు పురమాయించాం ఆ వచ్చిందెవరో చూడమని.

చూసివచ్చిన దీప, "ఎవరో తెలుగు యువకుడు. రమేషట. డ్రాయింగ్ రూమ్‌లో కూర్చోమన్నాను." అంటూ లోనికి వెళ్ళిపోయింది.

రవివర్మ గంతేసినట్టు లేచారు. నేను కూడ ఆయన వెనుకే వెళ్లాను.

నిగనిగలాడే తెల్లని దుస్తుల్లో, సన్నని మీసకట్టు, వంకర్లు తిరిగిన తల, కండలు తిరిగి తెల్లని ఛాయున్న దేహం గల పాతికేళ్ళ యువకుడు మమ్ములను చూసి ఠీవిగా నిలుచున్నాడు. వినయంగా రెండు చేతులెత్తి నమస్కరించాడు. వర్మగారు సాదరంగా పలకరించి కూర్చోమన్నారు.

"నా పేరు రమేష్ పి.డబ్ల్యు.డి.లో జూనియర్ ఇంజనీర్‌గా యిక్కడికి పోస్టింగయ్యాను. బరగడ్‌లో వుంటున్న ఆదిత్యశర్మగారు మీకీ వుత్తరమిమ్మన్నారు" అంటూ ఒక ఉత్తరాన్ని అందించాడు.

ఏమిటి సంగతన్నట్టు నేను ముఖం పెట్టడం చూసి "ఆదిత్యశర్మ గారని బరగడ్‌లో వుంటున్నారు దీపను మాట్లాడానికి వస్తారు వచ్చేనెల" అన్నారు నాతో వర్మగారు.

ఉత్తరం చదివాక ఆయనన్నారు— "ఇల్లు అద్దెకిచ్చే అవసరం మాకు లేదను కోండి. అయినా శర్మగారు రికమండ్‌చేసి నప్పుడు కాదనటం భావ్యంకాదు. ఒక నెలపాటు ఆ ప్రక్క పోర్షన్ వాడుకోండి. అద్దెకు కాదు సుమండీ! ఈలోగా మరో మంచి యింటికోసం ప్రయత్నించుకొండి. నేను కూడ మీకు సహాయం చేస్తాను," అన్నారు.

"చాల థేంక్సండీ" అన్నాడా యువకుడు సంబరపడుతూ.

"ఇంతకూ మీకు పెళ్ళయిందా లేక బ్రహ్మచారులా!" అడిగాను నేను.

ఒక్క క్షణం నిశ్శబ్దంగా వుండి పోయాడు. పెళ్ళి కాలేదంటే దొరికిన యిల్లు మరి దొరకదేమోనన్న భయంతో కాబోలును— "పెళ్ళయిందనుకోండి. ఒక యిష్యూ కూడాను" అన్నాడు.

"ఐతే సరే! మీ కుటుంబాన్ని తీసుకొని వచ్చేసేయ్ రమేష్‌బాబు. ఇక్కడ నీకొచ్చే యిబ్బందేమీ వుండదు. కుటుంబంతో మరో నెల వుంటానన్నా అభ్యంతరం వుండదు," అన్నారు వర్మ గారు.

"అలాగే సార్! రెండు మూడు రోజులు పోయాక వెళ్ళి తీసుకువస్తాను."

"ఇంతకూ ఆదిత్యశర్మగారెలా వున్నారు? వాళ్ళబ్బాయి రాజేష్‌పై నీ వుద్దేశమేమిటి? నేనెప్పుడూ అతణ్ణిచూసి వుండలేదు. ఆమధ్య మద్రాస్‌లో యింజ నీరింగ్ చదువుతుండేవాడని విన్నాను." అడిగారు వర్మగారు

"అంతా కులాసాగా వున్నారు సార్. ఇక రాజేష్ విషయమా అంటే, మీరే చూస్తారుగా. మీరంతా తప్పక ఎప్రిషియేట్ చేస్తారు."

దీప మూడు కాఫీ కప్పులతో వచ్చింది.

రమేష్ చూపులు ఆమెపై కేంద్రీకృత మయ్యాయి. ఆమె కూడా చూడటం గమనించాను.

ముగ్గురకు మూడు కప్పులందించింది. రమేష్ కప్పు నందుకుంటూ థేంక్స్ చెప్పుకున్నాడు.

వర్మగారు వాళ్ళిద్దరకు పరిచయం చేస్తూ—"అమ్మా దీపా! ఈయన రమేష్ గారని బరగడ్‌వారు. ఆదిత్యశర్మగారని నా స్నేహితులొకాయన వున్నారు. ఆయన ద్వారా పరిచయమయ్యారు. జూనియర్ ఇంజనీర్‌గా యిక్కడికి పోస్టింగయ్యారు" అని— "ఈమె మా

దీప. బి. ఏ. పాసయ్యి మానేసింది" అన్నారు.

ఇద్దరు నమస్కార ప్రతి నమస్కారాలు పెట్టుకున్నారు.

కాఫీ త్రాగడం పూర్తిచేసి కప్పులు దీపకందించారు.

"ఇంతకూ మీ అత్తవారేవూరు ? మీ శ్రీమతి పేరేమిటి ? అమ్మాయా ? అబ్బాయా ?" అడిగాను నేను.

నావైపు కొరకొర చూసినట్టు అర్థమయ్యింది. సమాధానమివ్వకుండా లేచి నిలుచున్నాడు. "తరవాత తీరికగా మాట్లాడతాను. ఇప్పటికి శలవిప్పించండి" అంటూ అందరికీ (దీపకూడ) నమస్కరించి చకచకమని బయటకు వెళ్ళిపోయాడు

ఆ మరునటి రోజు___

బెడ్డింగూ సూట్ కేసూ రిక్షాలో పెట్టుకొని ఆనందనివాసంలో అడుగు పెట్టాడు రమేష్. అంతకు ముందుగానే ఆ పోర్షనంతా కడిగించి శుభ్రంచేయించింది దీప.

ఇంటిలో దిగిన మరునటిరోజునుండే మాలో ఒకడిగా మారిపోయాడు రమేష్. దానికాకారణం వర్మగారి కలుపుగోలుతనమే. చదరంగంలో రమేష్ వేసే ఎత్తులకు పై ఎత్తులు వేయలేక తికమక పడేవారు వర్మగారు. కేరమ్స్ ఆటలో దీపకు రమేష్‌కు మంచి కాంపిటీషన్ వుండేది. నాతో సాహితీ విషయాలు చర్చించి నా ముఖానికి వెల్లవేసి వదిలి పెట్టేవాడు. అన్ని విషయాల్లోను అంతో ఇంతో నేర్పరితనం చూపించి, 'మా మనస్సులను జయించి మా అందరినీ వశపరచుకున్నాడు.

రమేష్ దీప చాల సన్నిహితులయ్యారు. వర్మగారికి, చిన్నతనంలోనే నీటిప్రమాదానికి గురియై చనిపోయిన కొడుకు గోపాల్ గుర్తుకు వచ్చి విచారించినా, రమేష్‌లో గోపాల్‌ను చూసుకున్నారు. అందుకే యింటిలో పూర్తి స్వాతంత్ర్యమిచ్చారు కూడ.

రమేష్ దీపతో ఎక్కువ సమయం గడుపుతుండటం నా కిష్టముండేది కాదు. కాని నేను చేసేదేముంది ? ఆ యింటి ఆప్తమిత్రునిగా దీప క్షేమాన్ని కోరుకొనేవాణ్ణి.

దీపతో గడిపేవేళ రమేష్ చూపులు వాడిగా ప్రేమను వ్యక్తపరిచేటట్టు వుండేవి. కాని దీప చూపులు చల్లగా భక్తిభావంతో కూడి వుండేవి.

ఒక రోజు ఆదిత్యశర్మగారినుంచి కబురొచ్చింది. వచ్చే ఆదివారం సాయంత్రం నాలుగు గంటల వేళ దీపను చూడటానికి, మాటలు జరుపుకోవటానికి వస్తున్నట్లు కబురుచేశారు.

ఈ వార్త వచ్చేటప్పటికి రమేష్ మాతోనే వున్నాడు. ఆ సాయంత్రమే శలవులో యింటికి వెళుతున్నట్టు చెప్పి బెడ్డింగుతో సహా బయలుదేరాడు.

నిజానికి అతడు అకస్మాత్తుగా బయలు దేరటం, అందరి మనసుల్లో బాధను రేపింది అతణ్ణి విడవాలంటే మాకేదోలా వుండేది అతడిచ్చిన కంపెనీ మరువ రానిది.

ఇది ప్రవాసాంధ్రులమనే అభిమానం వల్ల కలిగిన సన్నిహితం. ఒకరకంగా మాతృరాష్ట్రాన్ని వీడి, మరో రాష్ట్రంలో మరో భాషను వ్యవహరిస్తూ బ్రతక వలసి వచ్చినందువల్ల కలిగిన అనుబంధం. ఇది నిజానికి తాత్కాలికమే.

వ్యధిత హృదయాలతో వీడ్కోలిచ్చా మా నవయువకునకు. దీప కళ్ళలో నీళ్ళు తిరగటం రమేష్‌తో పాటు నేను కూడ గమనించగలిగాను.

కాలచక్రంలో ఆరు రోజులు అవలీలగా నలిగిపోయాయి.

ఆదివారం రానే వచ్చింది.

ఆదిత్యశర్మగార్ని పరివారాన్ని మోసుకుంటు ఆకుపచ్చని ఓ టాక్సీ, ఆనంద నివాసపు ఆవరణలోకి వచ్చి ఆగింది. వాళ్ళకోసమే వర్మగారు, నేను వరండాలో తిరుగులాడుతున్నాం. వారిని సాదరంగా ఆహ్వానించి లోనికి తీసుకెళ్ళి కూర్చోబెట్టాం. రమేష్ కూడ వాళ్ళలోనే వున్నాడు. రాజేష్ వాళ్ళతో వచ్చినట్టు లేదు.

అలంకరింపబడిన దీప, ఫలహారాల ట్రేతో మేమంతా వున్న గదిలోనికి వచ్చింది సిగ్గుతో తల వాల్చుకుంటూ.

రమేష్ పరిచయం చేయించాడు—
"ఈయన ఆదిత్య శర్మగారని, నాన్నగారు స్నేహితులు ఈమె మిసెస్ శర్మగారు."

దీప రెండు చేతులెత్తి వినయంగా నమస్కరించింది

అందరికళ్ళు జిగేల్ మన్నాయి అప్పటి ఆమె భంగిమను చూసి.

పసిమి ఛాయలో, నీలిరంగు కంచి వరపు చీరలో, తెనుగుతనాన్నంతా తనలోనే యిముడ్చుకొని నీలాంబరాలు నిండిన జడలో, చక్కగా ముస్తాబయి, దేవునిముందు నిలబడి భక్తిగా జోహార్లర్పిస్తున్న దివ్యకన్యలా తోచింది మాఅందరి కళ్ళకు. శర్మగారు ముగ్ధులయారు.

"ఒక్కమాటలో చెప్పాలంటే అమ్మాయి రూపసి. మీ కభ్యంతరం లేకుంటే సంబంధం ఖాయమైనట్టే."

అందరి మనసుల్లో ఆనందం వెల్లివిరిసింది.

"నామట్టుకు నాకేమీ అభ్యంతరం లేదుగాని, అబ్బాయి అమ్మాయి యిష్టపడితేగాని మనం చేసేది లేదు. అబ్బాయిని చూసిన పిమ్మట ఆఖరి నిర్ణయం తీసుకుందాం." అన్నారు వర్మగారు.

"అలాగా! మావాడి తరపున రమేషెలాగూ వచ్చాడు. అతడినే మా వాడిగా భావించి ఖాయపర్చుకుంటేనే నయంగా. రూపురేఖ లేంటి, అంద

చందా లేంటి అన్నీ మావాడి కార్బన్ కాపీయే నండి.

"కావచ్చు. అదీ రమేష్ రికమెండ్ చేస్తున్న అబ్బాయి అయినప్పుడు ఆలోచించటం అనవసరమే ననుకొండి. ఐనా, యిది రెండు నిజజీవిత సమస్య యినప్పుడు, అన్నీ నిజంగా జరగడం శ్రేయస్కరం. పోలికలతో పని జరపడం అవివేకం."

వర్మగారి పాయింటు వండర్ ఫుల్. అతని పితృహృదయానికి జోహర్లు.

వర్మగారి మాటలకు శర్మగారు బిగ్గరగా నవ్వడం ప్రారంభించారు. అసలు నవ్వవలసిన జోకు ఎక్కడుందో ఎవరికీ అర్థంకాక అమోమయంగా ముఖం పెట్టాం. అతడి నవ్వుకు రమేష్ మిసెస్ శర్మగారు వంత పలికారు. ఆయనలా నవ్వి నవ్వి, ఆ నవ్వు తారస్థాయి నందుకున్న తరువాత చెప్పడం మొదలెట్టారు. "అయ్యా! వీడేనండి మా అబ్బాయి రాజేష్. మేం మీ సంబంధం గురించి చెప్పేసరికి, యే అమ్మాయిని గాని ప్రేమించిన తరవాతనే పెళ్ళి సంగతి అని వాదించాడు. ఈ కాలం పిల్లకాయలు మన మాటెక్కడ వింటారండి. అందుకు ముందుగా మీ యింటిలో రమేష్ పేరుతో అద్దెకుదిగి, దీపను ప్రేమించి, అంగీకారాన్ని తెలిపిన పిదప, బయలుదేరి వచ్చాం. అబ్బాయి, అమ్మాయి ఒకరి నొకరు అర్థంచేసుకున్న తరవాత, మీరు కాదనడంలో అర్థముందంటారా? అమ్మా దీపా, యిలా వచ్చి కూర్చో తల్లీ. అసలు మావాడు వెళ్ళిపోతుంటే, దీప ఏడ్చేసిందట కూడాను."


మా అందరకు రమేష్.... కాదు... కాదు.... రాజేష్ చేసినపని వినోదంగాను, ఆశ్చర్యంగాను తోచింది అతని వైపు మెచ్చుకోలుగా చూశాం. ఆనాటి రమేష్ వాడిచూపుల కర్థం యీనాడు బోధపడింది.

ఈనాడు రాజేష్ కళ్ళు దీపపైనే వున్నాయి.

మళ్ళీ శర్మగారే ప్రారంభించారు—"ఎలాగయినా యీ కాలపు యువతీ యువకులు ప్రేమలో పండితులు సుమండీ. స్కూళ్ళలోను, కాలేజీల్లోను ప్రేమను గూర్చిన కోర్సులు లేకపోయినా, పరోక్షంగా నయినా, వాళ్ళా కోర్సును అక్కడనే అభ్యసిస్తున్నారు. ఎవరి అభిప్రాయం యెలావున్నా, ప్రేమ వివాహాలను ప్రోత్సహించాలన్నదే నా వాదన."

దీప ముఖం కాంతి విహీనమయ్యింది. మనస్సులోని భావాలు రంగులు మారాయి. విసురుగా లేచి ప్రక్కగదిలోకి వెళ్ళిపోయింది. జరిగిందేమిటో ఎవరికీ అర్థంకాలేదు.

"ఏం జరిగిందమ్మా?" అంటూ ఆమె వెనకే రవివర్మ లోనికి వెళ్ళారు. సమాధానమివ్వని దీపను మరోసారి ఒత్తిడి చేశారు.



"అమ్మా దీపా! ఏమయ్యింది చెప్పు తల్లీ!" అడిగారు వర్మగారు ఆందోళనగా. అందరి చెవులు ప్రక్కగది వైపే నిలిపారు.

దీపకు ఏడుపు ముంచుకొచ్చింది.

"ఇక జరగవలసిందేముంది నాన్నా! మగవారి మాట ముఖ్యం. నేను ఆడదాన్ని. నా అభిప్రాయాలు, భావాలు మీ కక్కర్లేదు. కాని నాన్నగారూ, రాజేష్‌కు నాకు పెళ్ళి నిశ్చయించడం దారుణం. ఎక్కడన్నా అన్నాచెల్లెళ్ళకు పెళ్ళి జరుగుతుందా? రాజేష్‌గారు ప్రేమిద్దామనే తలంపుతోనే మన యింటిలో అడుగుపెట్టవచ్చును. కాని పెళ్ళయిన వ్యక్తిగా పరిచయమవడం అతడి తొలి పొరపాటు. పెళ్ళయినట్టు పరిచయమైన అతడిపై ప్రేమెలా పుడుతుంది? అఁ.... ప్రేమ కలిగింది.

కాని అది ప్రేయసీ ప్రియుల ప్రేమకాదే అంతకన్నా ఉన్నత మయినది పవిత్ర మయినదయిన సోదర ప్రేమ. బ్రహ్మ చారిగా ప్రవేశిస్తే బహుధూరాన వుందునే అన్నదమ్ములకు వారి అను రాగాలకు నోచుకొనని నేను సోదర ప్రేమకై వారికి చేరువయ్యాను. కాని దాని పరిణామ మిలా వుంటుందని వూహించనయినా లేదు. ఇన్నాళ్ళు అతడినుండి పొందినది స్వచ్ఛమయిన సోదర ప్రేమ కాదని తెలిసిన క్షణంనుండి నా హృదయం మండిపోతున్నది. ఈ మగాళ్ళదెంతటి సంకుచిత భావం? ఒక యువతి మరో యువకునితో చనువుగా వున్నంత మాత్రాన ఆమెను ప్రేయసి భావంతో చూద్దంతప్ప మరో భావం కలుగదా? హేః భగవాన్.... యీ మగాళ్ళకు ప్రేమాతురత తప్ప, ఆడదాని భావాలను గ్రహించి అర్థంచేసుకోగల నేర్పును కలిగించలేదు? ఈ జన్మకి సోదర ప్రేమ చాలును. పొరపాటున గూడ మరి ప్రయత్నించను. మీ అందరికీ యిష్టమయినప్పుడు కాళ్ళు చేతులుకట్టి, తాళికట్టించండి. నేను అబలను. సబలను గాను." వెక్కి వెక్కి ఏడ్చింది దీప.

ఈ హఠాత్పరిణామానికి రాజేష్ మెదడుకున్న తుప్పు రాలిపోయుండాలి. తలకు పట్టిన తిమ్మిరి తీరిపోయుండాలి. అవకాశానికై ఆడిన ఓ చిన్న అబద్ధం తనపై తీరని దెబ్బతీసింది. ప్రేమ మైకంలో నిండిన అతడి మనస్సు దీప మనోభావాలను మరో రీతిలో అర్థం చేసుకున్నది. ఆ రోజునుండి ప్రేమపిచ్చి శాశ్వతంగా వదిలిపోయుండాలికూడ.

రాజేష్, శర్మగారు అంతా లేచి నిలుచున్నారు. వర్మగారు తిరిగి రావడంతో — "అమ్మాయిని బలవంతం చేయకండి. మాకూ ఆడపిల్లలు లేరు. ఇకపై దీప మా యింటి ఆడపడుచు. ఇక వస్తాం, శలవ్."

టాక్సీ బయలుదేరింది భారంగా.

* * *

రాజేష్ నిజంగా మంచివాడు. అందుకే పిలవగానే కాదనకుండా దీప పెళ్ళికి వచ్చాడు.

తాను వలచిన మగువ మెడలో మరోవ్యక్తి మంగళసూత్రం ముడి వేస్తుంటే, నిశ్చలంగా చూస్తూ నిలబడే మనఃస్థైర్యం యెంతమంది మగాళ్ళ కుంటుంది?

'ఓ జగన్నాటక నటన సూత్రధారీ! నీ దర్శకత్వానికనుగుణంగా నటించడం మా ధర్మం. నీవేశ్వమంటే యేడుస్తున్నాం నవ్వమంటే నవ్వుతున్నాం. నీ యానతి మేరకు నడుస్తున్నాం. కాని ఒక్క విన్నపం స్వామీ! రాజేష్‌లాంటి యువకునితో నటించడానికి మాత్రం దీప లాంటి మరో చక్కని చుక్కను జత చేయమని నా వేడుక.' అనాలోచితం గానే నా మనస్సు కాంక్షించింది.

పెళ్ళి పూర్తయేసరికి నేనీ లోకంలో కొచ్చిపడ్డాను.

"ఈ జీవన తరంగాలలో........."

మైకులో పాట సాగుతున్నది.